

## రేకుల ఇంటికి రూ.9వేల కరెంటు బిల్లు

చేగుంట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కూలీ చేసుకొని రేకుల ఇంట్లో జీవనం సాగిస్తున్న ఓ నిరుపేద మహిళకు రూ. 10వేలు కరెంటు బిల్లు వచ్చింది. మెదక్ జిల్లా చేగుంటలోని సీఎంఆర్ కాలనీలో నివాసముంటున్న నూతనకంటి అరుణకు (సర్వీస్ నంబర్ 04660) ఉచిత కరెంటు పథకం కింద మార్చి నెల వరకు జీరో బిల్లు వచ్చింది. కానీ, ఏప్రిల్ నెలకు మాత్రం రూ. 9,073 బిల్లు ఇచ్చిన అధికారులు, కట్టాల్సిందేనని ఒత్తిడి చేస్తున్నారు. రెండు నెలలుగా ఆరోగ్యం బాగోలేక ఆసుపత్రి చుట్టూ తిరుగుతున్నానని, ఇంటి దగ్గర ఉండటమే లేదని ఆమె వాపోయారు.

# ప్రభాకర్‌రెడ్డి.. నీది కేసీఆర్ దగ్గర అటెండర్ డ్యూటీ

## సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి కాదని తెలుసుకో

- బీఆర్ఎస్ హయాంలో నీ గొంతు మూగబోయిందా?
- పదేళ్లు మెదక్ ఎంపీగా ఎన్ని నిధులు తెచ్చావు?
- మీ ప్రభుత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలు కేసీఆర్‌ను స్వేచ్ఛగా కలిశారా?
- మా సీఎం రేవంత్‌ను మంత్రులు, ఎమ్మెల్యేలు, ఓడినవారు కూడా స్వేచ్ఛగా కలుస్తున్నారు
- కేసీఆర్ వద్ద వంగి దండాలు పెట్టే పొజిషన్ నీది
- అలాంటి నువ్వు కాంగ్రెస్ పార్టీకి, సర్కారుకు సలహాలిస్తావా!
- మీ పార్టీలో లుకలుకల గురించి కేసీఆర్‌కు ఈ బోడి సలహాలిచ్చుకో
- దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఫైర్

సంగారెడ్డి ప్రతినిధి, ఆంధ్రజ్యోతి, జూన్ 2: 'ప్రభాకర్‌రెడ్డి.. నీది కేసీఆర్ దగ్గర అటెండర్ డ్యూటీ చేసే పొజిషన్. ఆయన కూర్చోమంటే కూర్చుంటావు.. నిల్చోమంటే నిల్చుంటావు. నువ్వా సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించేది. నీ స్థాయి తెలుసుకొని మాట్లాడు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్ర ఖజానాను ఖాళీ చేస్తుంటే నీ గొంతు మూగబోయిందా' అని దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మండిపడ్డారు. సోమవారం ఉదయం సిద్దిపేటలో కొత్త ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను జగ్గారెడ్డి తీవ్రంగా ఖండించారు. పదేళ్లు మెదక్ ఎంపీగా పనిచేసి ఎన్ని నిధులు తెచ్చావో.. ఎంత అభివృద్ధి చేశావో చెప్పాలని ప్రశ్నించారు. మీ ప్రభుత్వ హయాంలో నీతోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు కేసీఆర్‌ని కలిసే స్వేచ్ఛ ఉండేదా అని అడిగారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యేలు, మంత్రులతోపాటు ఓడిన వారు కూడా స్వేచ్ఛగా కలిసే అవకాశం ఉందన్నారు. కేసీఆర్ దగ్గర నీ పొజిషన్ అందరికీ తెలుసు. అలాంటి నువ్వు కాంగ్రెస్ పార్టీకి, కాంగ్రెస్ ప్రభుత్వానికి సలహాలు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. నీ బీఆర్ఎస్ పార్టీలోనే అంతర్గత కుమ్ములాటలు, లుకలుకలు చాలా ఉన్నాయని జగ్గారెడ్డి ఎద్దేవా చేశారు. అవసరమైతే నీ బోడి సలహాలు కేసీఆర్‌కు ఇచ్చుకోమంటూ జగ్గారెడ్డి దుయ్యబట్టారు.



టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



## రైల్వేలైన్ సమస్యల పరిష్కారానికి ఎంపీ చర్యలు

7

# నాయకుడు ఎవరు?

- బీజేపీ గజ్వేల్ నియోజకవర్గ పదవి ఆశలో పలువురు
- నాయకులు, కార్యకర్తల్లో కొరవడిన సమన్వయం
- పట్టింపులేని అధిష్ఠానం



గజ్వేల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ నియోజకవర్గంలో కాషాయదళం నాయకుడు లేని నావగా పయనిస్తుంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సొంత నియోజకవర్గమైన గజ్వేల్‌లో కాషాయ పార్టీకి ఇన్‌చార్జి లేకపోవడంతో నాయకుల మధ్య సమన్వయం కొరవడింది. ఇటీవలే భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడిని ప్రకటించగా, మండల అధ్యక్షులను సైతం ప్రకటించారు. ఈ నేపథ్యంలో గజ్వేల్ నియోజకవర్గంలో పార్టీని నడిపించే నాథుడు లేకపోవడంతో నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయ లోపం ఏర్పడి ఎవరి దారి వారిది అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి కేసీఆర్‌పై బీజేపీ అభ్యర్థిగా ఈటెల రాజేందర్ పోటీ చేయగా, అనంతరం ఆయన మల్కాజ్‌గిరి ఎంపీగా వెళ్లిపోయారు. అప్పటినుంచి గజ్వేల్ నియోజకవర్గంలో జరిగే కార్యక్రమాలను ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు సమన్వయం చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో నాయకుల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనబడుతుంది. కాంగ్రెస్‌కు డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ఇన్‌చార్జిగా, బీఆర్ఎస్‌కు మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఇన్‌చార్జిగా ఉన్నారు. బీజేపీకి మాత్రం ఇన్‌చార్జి లేకపోవడంతో నియోజకవర్గంలో బలమైన నాయకత్వం లేక ప్రతి సాధారణ ఎన్నికకు బయటి నాయకులపై ఆధారపడాల్సి వస్తుంది.

### పలువురి తహతహ..

గజ్వేల్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి పదవిని పలువురు నాయకులు ఆశిస్తున్నారు. గజ్వేల్‌లో గతంతో పోలిస్తే ప్రస్తుతం పార్టీ బలోపేతం కావడం, ప్రజలు సానుకూల భావన ఉండడంతో నియోజకవర్గ ఇన్‌చార్జి పదవి వస్తే లక్కు చిక్కినట్లేనని పలువురు నాయకులు భావిస్తున్నారు. ఇప్పటికే పది మంది నాయకులు నియోజకవర్గ ఇన్‌చార్జి పదవి వస్తే పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని చెబుతున్నప్పటికీ, అధిష్ఠానం మాత్రం ఆ దిశగా ఎలాంటి చొరవ చూపడం లేదని తెలుస్తుంది. గజ్వేల్ నియోజకవర్గంలో రెండు పర్యాయాలు పారాచూట్ నేతలకు టికెట్ ఇవ్వడంతో ఇక్కడి క్యాడర్ కొంత నిరాశ చెందింది. 2023లో జరిగిన ఎన్నికల్లో రాజేందర్ బరిలో దిగడంతో కొంత ఊరట చెందారు. ఆయన ఎంపీగా మల్కాజ్‌గిరి నుంచి పోటీ చేసి ఎంపీగా గెలుపొందడంతో గజ్వేల్ నియోజకవర్గంలో పార్టీని నడిపించే నాయకుడు కరువయ్యారు.

గజ్వేల్ నియోజకవర్గంలో కొన్నేళ్ల నుంచి బీజేపీలో ఏ నాయకుడికీ ఇన్‌చార్జి పదవి దక్కలేదు. పొత్తుల కారణంగా టీడీపీకి టికెట్‌ను అప్పగించిన బీజేపీ.. గజ్వేల్ నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయడంపై మాత్రం దృష్టి సారించలేదు. ఫలితంగా 2018లో స్థానికేతరురాలైన

మిగతా 8వ పేజీలో

# ప్రజాపాలనే పరమావధిగా

- తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌తో ముందుకు
- రాష్ట్ర అవతరణ వేడుకల్లో మంత్రి పొన్నం
- ప్రగతి, సంక్షేమ పథకాల అమలుపై ప్రసంగం

ప్రజాపాలనే పరమావధిగా, తెలంగాణ రైజింగ్ -2047 విజన్ లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకొని సిద్దిపేటలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఎగురవేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.

సిద్దిపేట కల్చరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి)

అధికారంలోకి వచ్చిన 8 నెలల కాలంలో 25,35,964 మంది రైతులకు సంబంధించిన రూ.20,617 కోట్లు రుణమాఫీ చేసినట్లు చెప్పారు. జిల్లాలో 1,10,893 మంది రైతులకు రూ.934కోట్ల రుణమాఫీ జరిగిందన్నారు. నిరుపేదలు ఆత్మగౌరవంతో బతికేందుకు ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పథకాలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. పారదర్శకంగా కులగణన నిర్వహించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

యువతకు ఉపాధి, ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా మొదటి ఏడాదిలోనే 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసినట్లు చెప్పారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో రాజీవ్ యువ వికాసం అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఆడ బిడ్డలను సంపన్నులను చేయాలని సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల ఆధ్వర్యంలో విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించిందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యంను సామాన్యులకు అందేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. రూ.5లక్షల పరిమితిని రూ.10 లక్షలకు పెంచడంతో పాటు కొత్తగా 163 వ్యాధులను చేరుస్తూ మొత్తం 1835 వ్యాధులకు ఈ పథకం పరిధిని విస్తరించినట్లు వివరించారు. జిల్లావ్యాప్తంగా పలువురి సహకారంతో 8,750 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మహిళలు, పిల్లల రక్షణకు షీ టీమ్స్ అవెర్‌నెస్, సామాజిక రుగ్మతలకు అంశాలపై చైతన్యం చేయడానికి కనువిప్పు కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. తెలంగాణ రైజింగ్ 2047విజన్‌లో కీలక అంశాలున్నాయన్నారు. పేదల సంక్షేమం, సమగ్ర పాలసీల రూపకల్పన, ప్రపంచస్థాయి ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ ఈ లక్ష్యాల సాధనకు ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టిందన్నారు.వాహన కాలుష్యాన్ని తగ్గించడానికి ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అనంతరం తెలంగాణ అమరవీరుల కుటుంబాలను కలెక్టర్ ఎం. మను చౌదరి, సీపీ అనురాధ, అదనపు కలెక్టర్లు గరిమా అగ్రవాల్, అబ్దుల్ హమీద్‌తో కలిసి మంత్రి సన్మానించారు.



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్



అమరవీరుల కుటుంబాలను సన్మానిస్తున్న మంత్రి పొన్నం, పక్కన కలెక్టర్, సీపీ




సిద్దిపేటలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

మిగతా 8వ పేజీలో



## ఫ్లాగ్‌మార్చ్

సిద్దిపేట టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాజిత్‌పుర, కరీంనగర్ రోడ్, అంబేడ్కర్ నగర్, సంజీవయ్యనగర్, ప్రదేశాల్లో శాంతి భద్రతల పరిరక్షణపై సోమవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సిద్దిపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరావు, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, పోలీస్ సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులతో ఫ్లాగ్‌మార్చ్ చేపట్టారు. ఎవరు కూడా చట్టాన్ని చేతిలోకి తీసుకోవద్దని డయల్ 100, సిద్దిపేట పోలీస్ కంట్రోల్ రూం 8712667100 కాల్ చేసి సమాచారం అందించాలని తెలిపారు.

- సిద్దిపేట క్రైం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి)



# ఈవీ హవా..

- జిల్లాలో పెరుగుతున్న ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం
- పర్యావరణ పరిరక్షణకు మొగ్గుచూపుతున్న వాహనదారులు
- కొన్ని వాహనాలకు నో రిజిస్ట్రేషన్, నో డ్రైవింగ్ లైసెన్స్

సిద్దిపేట క్రైం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎలక్ట్రిక్ (ఈవీ) వేహికిల్స్ రోడ్లపై రయ్..రయ్.. అంటూ దూసుకుపోతున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది పెట్రోల్ వాహనాల కన్నా ఎలక్ట్రికల్ వాహనాలు ఎక్కువగా విక్రయాలు జరుగుతున్నాయి. రోజురోజుకూ పెట్రోల్ ధరలు పెరగడం, వాటితో పాటే వాహనాల రేట్లు కూడా భారీగా అధికమవుతుండడంతో వాహనదారులు ఎలక్ట్రిక్ వాహనాల వైపు మొగ్గుచూపుతున్నారు. పెట్రోల్ వాహనాలతో పర్యావరణం దెబ్బతింటుడడంతో ఎలక్ట్రికల్ వాహనాలను కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. మార్కెట్‌లో వివిధ కంపెనీలకు చెందిన ఎలక్ట్రికల్ వాహనాలు రూ.60 వేల నుండి రూ.2 లక్షల వరకు వున్నాయి.



సిద్దిపేటలో ఓ షోరూంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఎలక్ట్రికల్ వాహనాలు

### ఖర్చు తక్కువ

ఒక ఎలక్ట్రికల్ వాహనం ఒక్కసారి ఫుల్ ఛార్జింగ్ పెడితే 80 నుంచి 150 కిలోమీటర్ల వరకు నడుస్తుంది. పెట్రోల్ లీటర్‌కు రూ.107 ఉన్నది. లీటర్ 40 నుంచి 50 కిలోమీటర్ల వరకు మైలేజ్ ఇస్తుంది. దీంతో పోలిస్తే ఎలక్ట్రిక్ వాహనాలకు అయ్యే ఖర్చు చాలా తక్కువ. కరెంటు బిల్లు కూడా తక్కువ మొత్తంలోనే వస్తుంది.



### తగ్గిన పెట్రోల్ వాహనాల విక్రయాలు

గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది పెట్రోల్ వాహనాల విక్రయాలు తగ్గాయి. గత ఏడాది జిల్లాలో వివిధ షో రూం లలో ఒక నెలలో సుమారుగా 400 వాహనాలు అమ్ముడు పోగా, ఈ ఏడాది ఒక నెలలో సుమారు 200 పెట్రోల్ వాహనాలు అమ్ముడు పోయాయి. గత ఏడాది జిల్లాలో వివిధ షోరూంలలో ఒక నెలలో సుమారు 70 నుంచి 80 ఎలక్ట్రికల్ వాహనాలు అమ్ముడుపోగా, ఈ ఏడాది ఒక నెలలో సుమారు 150 నుంచి 160 ఎలక్ట్రికల్ వాహనాలు విక్రయాలు జరిగాయి.

గంటకు 40 కిలోమీటర్ల లోపు వెళ్లే ఎలక్ట్రికల్ వాహనాలకు రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్, పొల్యూషన్ పత్రాలు అవసరం లేదు. ఎక్కువ స్పీడ్‌తో ప్రయాణించే ఎలక్ట్రికల్ వాహనాలకు రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి. అన్ని ఎలక్ట్రికల్ వాహనాలకు పొల్యూషన్ సర్టిఫికెట్ లేకున్నా ట్రాఫిక్ జరిమానా పడదు. ప్రస్తుతం ఈ ఎలక్ట్రికల్ వాహనాలు మార్కెట్లోకి రావడంతో, విద్యార్థులు, మైనర్లు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఎలక్ట్రికల్ వాహనాలతో రయ్...రయ్ అంటూ దూసుకుపోతున్నారు.

### జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో

## సత్తాచాటిన చేర్యాల యువకుడు

- ఆలిండియా 65వ ర్యాంకు సాధించిన వెంకటేష్



వెంకటేశ్

చేర్యాల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): చేర్యాలకు చెందిన తాళ్లపల్లి వెంకటేశ్ జేఈఈ అడ్వాన్స్‌లో ఆల్ ఇండియా 65వ ర్యాంకు సాధించాడు. ఇటీవల వెలువడిన ఎప్‌సెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి 22వ ర్యాంకు, జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఆలిండియా 171వ ర్యాంక్ సాధించాడు. స్థానికులు వెంకటేశ్‌ను అభినందించారు.

### నేటి నుంచి పదోతరగతి

## సప్లిమెంటరీ పరీక్షలు

సిద్దిపేట కల్చరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : నేటి నుంచి 13 వరకు పదోతరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఇందుకోసం జిల్లా విద్యాధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లావ్యాప్తంగా నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. సిద్దిపేటలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ఇందిరానగర్ జడ్పీ హైస్కూల్, గజ్వేల్ టీజీఎమ్ఎస్, ప్రజ్ఞాపూర్‌లోని జడ్పీ హైస్కూల్ (బాయ్స్)లో మొత్తం 1169 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఉదయం 9:30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్షలు కొనసాగుతాయని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులకు హల్‌టికెట్స్ అందజేశామని, ఎవరైనా తీసుకోకపోతే బీఎస్ఈ తెలంగాణ పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని చెప్పారు.

### నవధాన్యాల సాగుతో

## రైతులకు మేలు

సిద్దిపేట కలెక్టరేట్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): పచ్చిరొట్టకు బదులుగా నవధాన్యాల సాగుతో రైతులకు మేలు చేకూరుతుందని జిల్లా ఆత్మకమిటీ డైరెక్టర్ స్వరూప రాణి తెలిపారు. వ్యవసాయంలో రోజురోజుకూ రసాయనాల వాడకం పెరగడం వల్ల ఉత్పత్తులు కలుషితమవుతున్నాయన్నారు. నిస్సారమైన ఆహారాన్ని తీసుకోవడం వల్ల అది మేలు చేయకపోగ పరోక్షంగా పలు రకాల సమస్యలు తలెత్తున్నాయని చెప్పారు. వీటిని అధిగమించాలంటే పంటలు పండించే విధానంలో మార్పు రావాలని సూచించారు. పచ్చిరొట్ట పైర్లలో అధికంగా జనుము, జిలుగు వేయగా కొద్దీ మొత్తంలో పెసర, పిల్లిపెసర సాగు చేస్తున్నారని, కానీ ఈ విత్తనాలు అందరికీ అందుబాటులో లేకపోవటం వల్ల చాలా మంది రైతులు ఇబ్బందులు పడుతుంటారని చెప్పారు. రైతులు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదన్నారు.

## భార్య హత్య కేసులో భర్తకు రిమాండ్

కుకునూరుపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): భార్యపై దాడి చేసి ఆమె మృతికి కారకుడైన భర్తను కుకునూరుపల్లి పోలీసులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. కుకునూరుపల్లి ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం కొండపాక గ్రామానికి చెందిన పొన్నాల యశోద తలపై భర్త మల్లేశం పారతోతో తీవ్రంగా కొట్టి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన యశోదను ఆసుపత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. కాగా ఆదివారం సాయంత్రం నిందితుడు హైదరాబాద్‌కు వెళ్లేందుకు కుకునూరుపల్లి బస్టాండ్ వద్ద ఉన్నాడని సమాచారమందుకున్న తొగుట సీఐ లతీఫ్, ఎస్‌ఐ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి చాకచక్యంగా నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. తానే భార్య యశోదపై దాడి చేసి మృతికి కారణమైనట్టు ఒప్పుకున్నాడు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి

జగదేవ్‌పూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని పీర్లపల్లి గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకున్నది. ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. జగదేవ్‌పూర్‌కు చెందిన రాయవరం కిష్టమ్మకు చిన్నకుమారుడు రాయరామ్ కనకయ్య(40) మద్యానికి బానిస కావడంతో అతడి భార్య సుజాత తల్లిగారి ఇంటి వద్ద ఉంటుంది. ఆదివారం సాయంత్రం కనకయ్య పీర్లపల్లిలోని తన చెల్లెలు వెంకటమ్మ ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి కాలినడకన వెళ్లాడు. అయితే పీర్లపల్లి గ్రామ శివారులో వ్యవసాయ బావి వద్ద అతడు మద్యం తాగతుండడాన్ని గమనించిన స్థానికులు అతడిని విచారించగా తన చెల్లెలి ఇంటికి వెళ్తూ కాలకృత్యాలు తీర్చుకునేందుకు బావివద్దకు వచ్చానని చెప్పాడు. ఈ క్రమంలో అతడు కాలుజారి బావిలో పడ్డాడని కొందరు చెల్లెలు వెంకటమ్మకు ఫోన్‌ద్వారా సమాచారమందించారు. బావిలో ఆదివారం రాత్రి గాలించినా ఫలితం లేకపోయింది. సోమవారం ఉదయం బావిలో కనకయ్య మృతదేహం లభ్యమైంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## అదృశ్యమైన వృద్ధుడు మృతదేహంగా..

కొండపాక, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అదృశ్యమైన ఓ వృద్ధుడు మృతదేహంగా లభ్యమయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని దమ్మక్కపల్లికి చెందిన జాలిగామ మల్లయ్య(80) అనే వృద్ధుడు 3రోజుల క్రితం అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం లేకపోయింది. సోమవారం కొండపాక శివారులోని బతుకమ్మ చెరువు సమీపంలో పడి ఉన్న మల్లయ్యను గమనించిన కొందరు కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. వారు చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్టు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

# వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

గజ్వేల్ రూరల్/పాపన్నపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో చోటు చేసుకున్న వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో సోమవారం ముగ్గురు మృతి చెందారు. గజ్వేల్ మండలంలో జరిగిన రెండు ఘటనల్లో ఇద్దరు మృతి చెందగా, పాపన్నపేట మండలంలో గాయపడిన వ్యక్తి చికిత్సపొందుతూ మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే..

### గజ్వేల్ మండలంలో..

మండలంలోని ప్రజ్ఞాపూర్ శివారులో గల పాతూరు కూరగాయల మార్కెట్ సమీపంలో బైక్‌ను డీసీఎం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మర్కుక్ మండలం పాతూరుకు చెందిన కొక్కొండ వెంకటేశ్(38) కూరగాయలు సాగు చేస్తూ జీవిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం కూరగాయలను తీసుకొని బైక్‌పై పాతూరు మార్కెట్‌కు వచ్చాడు. తిరిగి పాతూరులోని పొలానికి వెళ్తుండగా, మార్గమధ్యలో మహాలక్ష్మి రబ్బర్ పరిశ్రమ వద్ద ఎదురుగా వస్తున్న డీసీఎం వెంకటేష్ బైక్‌ను ఢీకొంది. తీవ్రగాయాలైన వెంకటేషను కుటుంబ సభ్యులు గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్టు డాక్టర్లు తెలిపారు. మరో ఘటనలో.. గజ్వేల్ పట్టణంలోని సంగాపూర్ దారిలో ఆదివారం రాత్రి బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బెజుగామ గ్రామానికి చెందిన ముత్యాల పరశురాములు(32)కు భార్యతో పాటు ఇద్దరు పిల్లలున్నారు. వారు జీవనోపాధి కోసం కొన్నేళ్ల క్రితం బొంబాయికి వెళ్లారు. వారం క్రితం పరశురాములు దంపతులు గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ(లక్ష్మాపూర్)లో ఉండే అత్తగారింటికి వచ్చాడు. ఆదివారం రాత్రి బైక్‌పై గజ్వేల్ నుంచి లక్ష్మాపూర్‌లో ఉండే అత్తగారింటికి బయలుదేరాడు. మార్గమధ్యలో రింగు రోడ్డు వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో పరశురాములు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.


లునావత్ సురేష్ (ఫైల్)

### పాపన్నపేట మండలంలో..

రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పోమ్లా తండాకు చెందిన లునావత్ సురేష్(28)వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. గత నెల 28న పాపన్నపేటకు వెళ్తూ నార్సింగి వద్ద అదే గ్రామానికి చెందిన నీలగిరి దుర్గయ్య ద్విచక్ర వాహనంపై ఎక్కాడు. నార్సింగి గ్రామ శివారులోకి చేరుకోగానే ముందు వెళ్తున్న టీవీఎస్ ఎక్సెల్‌ను వారి వాహనం వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో వాహనం వెనక కూర్చున్న సురేష్ కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స కోసం సురేష్‌ను హైదరాబాద్‌లోని గాంధీకి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి తల్లి మారోణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

## రెండిళ్లలో చోరీ

రాయపోల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని తాళాలు వేసిన రెండిళ్లలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధిత కుటుంబ సభ్యులు, ఎస్‌ఐ రఘుపతి వివరాల ప్రకారం.. కొత్తపల్లి గ్రామానికి చెందిన ఎర్రోళ్ల మల్లయ్య ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి ఓ శుభకార్యం నిమిత్తం ఊరికి వెళ్లాడు. సోమవారం ఉదయం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం, బీరువా తాళాలు పగలగొట్టి రూ. 56 వేలు, 18 తులాల కాళ్ల వెండి పట్టీలు అపహరించారు. మరో ఘటనలో కొత్తపల్లికి చెందిన గంగాధర భిక్షపతి కుటుంబం కొంతకాలంగా తుర్కపల్లిలో నివాసం ఉంటున్నారు. మే 22న బంధువుల పెళ్లి నిమిత్తం కొత్తపల్లికి వచ్చి 23న ఇంటి తాళం వేసి తిరిగి తుర్కపల్లి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు, బీరువాల తాళాలు పగులగొట్టి రూ. 17,500, బంగారు, వెండి ఆభరణాలను అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్‌ఐ తెలిపారు.

## బస్సులో ఐదుతులాల బంగారు నగలు అపహరణ

నర్సాపూర్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ నుంచి బోయినపల్లికి బస్సులో వెళ్తుండగా నర్సాపూర్ సమీపంలో బ్యాగులో ఉన్న 5తులాల బంగారు నగలు అపహరణకు గురయ్యాయి. సోమవారం ఎస్‌ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌లోని తిర్మలగిరిలో నివాసముండే మాధవి ఇద్దరు కూతుళ్లతో కలిసి తూప్రాన్‌లోని బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కు ఆదివారం వచ్చి తిరిగి సాయంత్రం నర్సాపూర్ మీదుగా స్వస్థలం వెళ్లేందుకు నర్సాపూర్‌లో బాలనగర్ బస్సు ఎక్కారు. వారి వెంట బ్యాగులో 5తులాల బంగారు నగలు కూడా ఉన్నాయి. బస్సు దిగగానే బ్యాగులో ఉన్న నగల హ్యాండ్ బ్యాగు కనిపించకపోవడంతో అంతా వెతికినా లాభం లేకపోయింది. అప్పటికే చీకటి పడటంతో సోమవారం వచ్చి నర్సాపూర్ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



సిద్దిపేట కలెక్టరేట్‌లో జెండా వందనం చేస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్



సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న ఎస్పీ పరితోష్ పంకజ్


మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న ఏఎస్పీ మహేందర్




మెదక్ కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న రాహుల్‌రాజ్

## అట్టహాసంగా 'అవతరణ' వేడుకలు

ఉమ్మడి జిల్లాలో రాష్ట్ర అవతరణ వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. మెదక్ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ రాహుల్‌రాజ్, సిద్దిపేట కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ జాతీయ పతాకాన్ని ఎగురవేసి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ పరితోష్ పంకజ్, మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఎస్పీ మహేందర్ జెండాను ఎగురవేశారు.

- సంగారెడ్డి క్రైం/సిద్దిపేట కలెక్టరేట్/మెదక్ అర్బన్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి)

## రైల్వేలైన్ సమస్యల పరిష్కారానికి ఎంపీ చర్యలు


రైల్వే అధికారితో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

రామచంద్రాపురం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : తెల్లాపూర్ రైల్వేలైన్ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని రెండు రోజుల క్రితం కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్నను ఎంపీ రఘునందన్‌రావు కోరిన విషయం తెలిసిందే. ఈ విషయమై ఎంపీ సోమవారం రైల్వేశాఖ సీనియర్ ఇంజనీర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ప్రధానంగా తెల్లాపూర్‌లో ఉన్న అండర్ రైల్వే బ్రిడ్జి వద్ద వరదనీరు సజావుగా వెళ్లడం, నూతన అండర్ బ్రిడ్జి నిర్మాణం నిర్మించడంపై చర్చించారు. అలాగే తెల్లాపూర్ నుంచి ఎంఐజీ వైపుకి ఫుట్ ఓవర్ నిర్మాణం, కొల్లూరు నుంచి వెలిమెల ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు రైల్వే క్రాసింగ్ నుంచి కొనసాగింపును త్వరగా నిర్మించడంపై సమీక్షించారు.

## దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్‌గా గాంధారి నరేందర్‌రెడ్డి


నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాక, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్‌గా తొగుట మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన గాంధారి నరేందర్‌రెడ్డిని నియమించారు. 25 మంది సభ్యులతో కూడిన ఆత్మ కమిటీని నియమించింది. గురువారం ప్రమాణస్వీకారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తనపై నమ్మకం ఉంచి, ఆత్మ కమిటీ చైర్మన్‌గా నియామకానికి సహకరించిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ దుబ్బాక నియోజవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## రాష్ట్రస్థాయి విద్యా పరిశోధన ప్రదర్శనకు మిర్జాపల్లి ఉపాధ్యాయుడు ఎంపిక


బాలరాజు

చిన్నశంకరంపేట జూన్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి విద్యా పరిశోధక ప్రదర్శనకు చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లి హైస్కూల్ ఉపాధ్యాయుడు బాలరాజు ఎంపికైనట్లు ఎంఈవో పుష్పవేణి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ హైదరాబాద్‌లో నిర్వహించే పాఠశాల అభివృద్ధి విద్యా బోధనపై ప్రదర్శించడానికి ఉత్తమ ఉపాధ్యాయుడు ఎంపిక హర్షణీయమన్నారు. కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరించే కమిటీ నుంచి ఎంపిక కావడం గర్వకారణమని ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందించారు.

## అంతర్ జిల్లా ఫుట్‌బాల్ పోటీల్లో విజేతగా రామాయంపేట యువజ్యోతి టీం

రామాయంపేట, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : అంతర్ జిల్లా ఫుట్‌బాల్ పోటీల్లో రామాయంపేట క్రీడాకారులు ప్రతిభ చాటారు. వరుసగా నాలుగు మ్యాచ్‌లు గెలిచి విజేతగా నిలిచారు. అండర్-17 విభాగంలో రామాయంపేట యువజ్యోతి స్పోర్ట్స్ క్లబ్ టీం నిజామాబాద్ జట్టుతో ఫైనల్‌లో తలపడి విజేతగా నిలిచింది. యువజ్యోతి జట్టుకు నిర్వాహకులు, నాయకులు కప్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కెప్టెన్ నవదీప్, శ్యామ్‌ను సన్మానించారు.


జహీరాబాద్ సమీపంలోని హోతి(కే) గ్రామ శివారులోని ప్రభుత్వ భూముల్లో తవ్వుతున్న ఎర్రరాయి

# సహజ సంపదకు ఆపద

### దర్జాగా ఎర్రరాయి తవ్వకాలు... మట్టినీ వదలని మైనింగ్ మాఫియా

జహీరాబాద్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ ప్రాంతమంటేనే ఎర్రరేగడి భూములకు, ఎర్ర రాయికి ప్రసిద్ధి. అలాంటి ప్రకృతిలో సహజ సిద్ధంగా లభించే ఈ ఎర్ర రాళ్లను మైనింగ్ మాఫియా దర్జాగా తవ్వేస్తూ కాసుల వేట కొనసాగిస్తున్నది. ప్రభుత్వ, ప్రైవేటు భూములనే తేడాలేకుండా దర్జాగా పెద్ద పెద్ద గోతులు తవ్వి రాయిని తీస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు నాయకుల సహకారంతో అధికారులను మచ్చిక చేసుకుని ప్రభుత్వానికి చెల్లించాల్సిన (రాయల్టీ) పన్నును ఎగ్గొడుతూ సహజ సంపదను యథేచ్ఛగా తరలిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు సెలవైతే చాలు. ఆ రోజుల్లో మైనింగ్ వ్యాపారులకు అడ్డుఅదుపు లేకుండా పోతున్నది. రాత్రి, పగలు లేకుండా రవాణా చేస్తున్నారు.


శేఖాపూర్ శివారులో మట్టిని తవ్వడంతో కరుగుతున్న ఏనె

**భూములను లీజుకు తీసుకుని..**

జహీరాబాద్, న్యాల్‌కల్, కోహీర్, మొగుడంపల్లి మండలాలు ఎర్ర నేలలు కావడంతో సహజ సిద్ధంగా ఇక్కడ ఎర్ర రాయి దొరుకుతుంది. జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యామ్తాబాద్, కల్‌బేమల్, హద్నూర్, గణేష్‌పూర్, కాశీంపూర్, ఆనెగుంట, హోతి(కే), చిన్నహైదరాబాద్, చున్నంబట్టి తాండ, మొగుడంపల్లి, పర్వతాపూర్. మిర్జంపల్లి, జాడిమల్కాపూర్, పడియాల్‌తాండ, ఉప్పర్‌పల్లి, మన్నాపూర్, విట్టునాయక్ తండా, శేఖాపూర్, పిచేర్యాగడి, వెంకటాపూర్, బడంపేట తదితర గ్రామాల పరిధిలో విస్తృతంగా ఎర్రరాయి నిక్షేపాలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ఎన్నో ఏళ్లుగా అనుమతికి మించి ఎర్రరాయిని తవ్వుతూనే ఉన్నారు. నిబంధనలకు విరుద్ధంగా లోతుకు తవ్వి దోచేస్తున్నారు. కొందరు అక్రమార్కులు ఎలాంటి పెట్టుబడి లేకుండానే రైతులకు ఎంతోకొంత చెల్లించి వ్యవసాయభూములను లీజుకు తీసుకుంటున్నారు. సుమారు 50 నుంచి 100 ఫీట్ల లోతుగా అత్యాధునిక కోత మిషన్ ద్వారా ఎర్రరాయిని తవ్వి తీస్తున్నారు. అనంతరం ఆ గుంతలను అలాగే వదిలేస్తున్నారు. వర్షాకాలంలో ఈ గుంతల్లో చేరిన నీటిలో పశువులను మేపడానికి వెళ్లిన కాపరులు పడి మృత్యువాత పడిన సందర్భాలున్నాయి. ఇలా ఇష్టారీతిన తవ్వితీసి, ఒక్కోరాయిని రూ.15-25 వరకు అమ్ముకుంటూ కాసులు పోగేసుకుంటున్నారు. రాత్రి వేళల్లోనే ఎర్రరాయిని తరలిస్తూ, ఫిర్యాదు చేసిన వారిని మైనింగ్ మాఫియా భయభ్రాంతులకు గురిచేస్తున్నది. రాయినే కదా విలువైన ఎర్ర మట్టిని సైతం కాసుల కక్కుర్తితో కరిగించేస్తున్నారు.


తవ్విన ఎర్ర మట్టి

**చర్యలు తీసుకుంటాం**



అనుమతులు లేకుండా ఎర్రరాయి తీస్తున్న విషయం, మట్టిత రలింపు తదితరాలు మా దృష్టికి వచ్చాయి. ఎక్కడెక్కడ తీస్తున్నారనే విషయమై క్షేత్రస్థాయిలో పరిశీలించి సిబ్బందితో వెళ్లి చర్యలు తీసుకుంటాం. అనుమతులు లేకుండా తవ్వితే ఎంతటి వారినైన ఉపేక్షించబోం.

- రాంరెడ్డి, జహీరాబాద్ ఆర్డీవో

## సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ భూబాధితుడికి ఎట్టకేలకు పరిహారం

- దశాబ్ద కాలం తర్వాత చెక్కు అందజేత
- రెవెన్యూ, పోలీసు అధికారుల జోక్యంతో అంగీకరించిన రైతు


మల్లేశంకు చెక్కును అందజేస్తున్న ఆర్డీవో పాండు

పుల్‌కల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ నిర్మాణంలో భూమి కోల్పోయిన బాధితుడికి ఎట్టకేలకు పరిహారం చెక్కును అందజేశారు. 2012లో సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ నిర్మాణంతో సర్వే నంబర్ 40/ఇలో గొల్ల మల్లేశం 3.05 ఎకరాల భూమిని కోల్పోయారు. ఈ భూమికి అప్పట్లో రూ.8,70,438 లక్షలు మంజూరవగా, పరిహారం సరిపోదంటూ బాధితుడు మల్లేశం చెక్కు తీసుకోకుండా నిరాకరించారు. భూమిని జేఎన్టీయూకు ఇచ్చేది లేదంటూ కోర్టును ఆశ్రయించగా, మంజూరైన పరిహారం డబ్బు ఆర్డీవో ఖాతాలో జమ చేశారు. అయితే, ఇటీవల కళాశాలలో తన భూమిలో పనులు చేపడుతున్న విషయం తెలుసుకుని మల్లేశం కుటుంబసభ్యులతో కలిసి వెళ్లి ఆందోళన నిర్వహించారు. ఈ విషయమై జోగిపేట సీఐ అనిల్‌కుమార్, చౌటకూర్ మండల నయాబ్ తహసీల్దార్ అనుదీప్ జోక్యం చేసుకుని బాధితుడు గొల్ల మల్లేశంతో మాట్లాడి నచ్చజెప్పారు. దీంతో ఎట్టకేలకు పరిహారం చెక్కును తీసుకునేందుకే అంగీకరించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం పరిహారం చెక్కును గొల్ల మల్లేశంకు అందోలు-జోగిపేట ఆర్డీవో పాండు అందజేశారు.

## శభాష్ సలీం


నగదు, బంగారం యాదగిరికి అందజేస్తున్న దృశ్యం

జగదేవ్‌పూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : ఓ ప్రయాణికుడు బస్సులో ప్రయాణిస్తూ ఏడు తులాల బంగారం, రూ. 2.50లక్షలు ఉన్న బ్యాగును బస్సులో మరిచిపోయి దిగి వెళ్లిపోగా ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్ దానిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు జగదేవ్‌పూర్ ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు భువనగిరి నుంచి సోమవారం సాయంత్రం గజ్వేల్ వైపు వస్తుండగా బస్సులో ప్రయాణిస్తున్న ఖమ్మం జిల్లా ఇల్లందుకు చెందిన బంటు యాదగిరి తన బ్యాగును మరిచిపోయి జగదేవ్‌పూర్‌లో దిగారు. బ్యాగును వదిలేసి వెళ్లిపోవడంతో అది గమనించిన డ్రైవర్ సలీం, కండక్టర్ ప్రకాష్‌కు చెప్పాడు. ఇద్దరు కలిసి ఆ బ్యాగును తీసి చూడగా దానిలో బంగారం నగదు ఉండడంతో ఆ బ్యాగును జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. వారు యాదగిరికి సమాచారమందించి బ్యాగును అందజేశారు.

## జీజీహెచ్‌లో కరెంట్ పోయినా..నో టెన్షన్!

**క్షణాల్లో జనరేటర్ ఆన్**

**జహీరాబాద్ ఘటనతో అప్రమత్తం**

సంగారెడ్డి అర్బన్, జూన్ 2(ఆంధ్రజ్యోతి) : మూడు రోజుల క్రితం జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పవర్ కట్ సమయంలో జనరేటర్ ఆన్ చేయకుండా నిర్లక్ష్యం చేసిన ఘటనపై ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించి ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై సస్పెన్షన్ వేటు వేసింది. అటువంటి సంఘటన తిరిగి పునరావృతం కాకుండా విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు విద్యుత్ పునరుద్ధరణ వెంటనే జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం అన్ని ఆస్పత్రుల సూపరింటెండెంట్లకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) అధికారులు ఆదిశగా చర్యలకు ఉపక్రమించారు. ఒకవేళ పవర్ కట్‌తో విద్యుత్ అంతరాయం ఏర్పడితే వెంటనే జనరేటర్ ఆన్ అయ్యేలా సిస్టంను ఏర్పాటు చేశారు. గతంలో పవర్ కట్ ఉంటే జనరేటర్ వద్దకు ఎలక్ట్రిషన్ వెళ్లి స్వయంగా ఆన్ చేస్తే తప్పా పునరుద్దరణ జరిగేది కాదు. తాజా చర్యలతో పవర్ కట్ జరిగితే క్షణాల్లో జనరేటర్ ఆన్ కానున్నది. కాగా ఆస్పత్రికి వచ్చే రోగులు ఎటువంటి అసౌకర్యాలకు గురికాకుండా అన్ని రకాలుగా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ జి.అనిల్‌కుమార్ స్పష్టం చేశారు.

## గుమ్మడిదల రైతులకు న్యాయం చేయాలి

- కలెక్టర్‌ను కోరిన హరీశ్‌రావు

గుమ్మడిదల, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : లగచర్ల తరహాలో గుమ్మడిదలలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు కోరారు. సోమవారం రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో బాధిత రైతులు హైదరాబాద్‌లోని హరీశ్‌రావు ఇంటి వద్ద ఆయనను కలిసి తమ సమస్యలు వివరించారు. రైతుల వేదన విన్న హరీశ్‌రావు వెంటనే కలెక్టర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో 109 సర్వేలో భూములు కోల్పోతున్న రైతులకు ఒక్కో రైతుకు 600 గజాల భూమిని ఇవ్వాలని నిర్ణయించామని, సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా లగచర్లలో రైతులకు పరిహారం చెల్లించి ఉద్యోగాలు ఇచ్చినట్లు, అదే తరహాలో గుమ్మడిదల రైతులకూ న్యాయం జరగాలని కలెక్టర్‌ను కోరారు. హరీశ్‌రావును కలిసిన వారిలో పటాన్‌చెరు కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి రాష్ట్ర నాయకులు కొలన్ బాల్‌రెడ్డి, వెంకటేశంగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.


మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసిన గుమ్మడిదల రైతులు, నాయకులు

# ఏడి పింఛన్

**పోస్టాఫీసు ద్వారా పెన్షన్ పొందే లబ్ధిదారుల అవస్థలు**

**నెలలో నాలుగు రోజులే ఇచ్చి చేతులు దులుపుకుంటున్న పోస్టల్ శాఖ**

నర్సాపూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులకు ప్రభుత్వం నెలనెల అందించే పింఛన్ డబ్బుల కోసం పోస్టల్ శాఖ చుక్కలు చూపెడుతున్నది. పింఛన్ అందితేనే అవసరాలు తీరే నిరుపేదలైతే ఎప్పుడెప్పుడొస్తాయా అని ఎదురుచూస్తుంటారు. పింఛన్ డబ్బు వచ్చాయనగానే డబ్బులు తీసుకోవడానికి పోస్టాఫీసుకు పరుగులు పెడుతుంటారు. కానీ పోస్టాఫీసు కార్యాలయం వారు మాత్రం నెలలో నాలుగు రోజులు మాత్రమే పింఛన్ డబ్బు చెల్లించి, తర్వాత వచ్చిన వారికి మొండిచేయి చూపెడుతున్నారు. నర్సాపూర్ పోస్టల్ శాఖ పరిధిలో పింఛన్ పొందే వారికి ఆ శాఖ చుక్కలు చూపుతు గోస పెడుతుంది.

నర్సాపూర్ పోస్టల్‌శాఖ పరిధిలో ఉన్న కౌడిపల్లి, నర్సాపూర్, గుమ్మడిదల బ్రాంచుల పరిధిలోని వారికి పింఛన్ డబ్బులు పోస్టల్‌శాఖలో పనిచేసే బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్(బీపీఎం) ద్వారా లబ్ధిదారులకు అందజేస్తారు. ఇలా పోస్టల్‌శాఖ ద్వారా పొందే వారు నర్సాపూర్ పట్టణంలోనే 1600 మంది వరకు ఉన్నారు. 16 బీపీఎంల పరిధిలో ఒక్కో బీపీఎంకు 300 నుంచి 600 మంది వరకు పెన్షన్‌దారులు ఉంటారు. నెలనెల మంజూరయ్యే పెన్షన్‌ను నెల అంతా ఇవ్వాల్సి ఉండగా పోస్టల్‌శాఖ మాత్రం నెలలో నాల్గుఐదు రోజులకు మించి అది కూడా చివరి తేదీల్లో ఇస్తూ చేతులు దులుపుకుంటుంది. మే నెలలో పింఛన్ డబ్బులు లబ్ధిదారుల ఖాతాలో 26వ తేదీన వేయగా, 27వ తేదీ నుంచి నెలాఖరు వరకు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. డబ్బులు పడ్డట్టు తెలిసిన వారు ఆయా బీపీఎంల వద్దకు వెళ్లి తీసుకోగా, ఇంకా తీసుకోని వారు చాలా మంది ఉన్నారు. దీంతో మే నెల దాటి జూన్ నెల రాగా, బీపీఎంలు పింఛన్‌ను పంపిణీ చేయడం లేదు. తమ డబ్బు ఇవ్వాలని పోస్టాఫీసుకు, బీపీఎంల వద్దకు వెలితే నెల అయిపోయింది ఇక రావంటు పంపిస్తున్నారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోస్టల్‌శాఖ వ్యవహారం వల్ల గ్రామాల్లో పనిచేసే బీపీఎంలు స్థానిక పెన్షన్‌దారుల చేత చివాట్లు తినాల్సిన పరిస్థితి నెలకొంది. నెలనెల వచ్చే పెన్షన్ డబ్బులను నెలాఖరున నాల్గు ఐదురోజులు కాకుండా మొదటి తేదీ నుంచి నెలాఖరు వరకు ఏ రోజు వచ్చిన ఇచ్చేటట్టు చూడాలని ఎన్నిమార్లు పోస్టల్ శాఖ అధికారులను ప్రజాప్రతినిధులు కోరినా తమ ధోరణిని మార్చుకోవడం లేదు. దీంతో పింఛన్ మీదనే ఆధారపడి ఉండే లబ్ధిదారులు పడుతున్న ఇబ్బందులు అన్ని ఇన్ని కావు.


నర్సాపూర్ పోస్టాఫీసుకు వచ్చి నిరాశతో వెళ్తున్న లబ్ధిదారులు

## న్యూస్ బాక్స్

### డ్రంకెన్ డ్రైవ్‌లో 19 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సిద్ధిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తన సిబ్బందితో కలిసి కొన్ని రోజుల క్రితం నుంచి సిద్దిపేట పట్టణంలో నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తాలలో ,రాజీవ్ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో 19 మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకున్నారు.

### బోరుబావులు మంజూరు

హుస్నాబాద్‌రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న తాగునీటి ఇబ్బందులు తీర్చేందుకు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ బోరుబావులను మంజూరు చేసినట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం హుస్నాబాద్ మండలంలో పోతారం(ఎస్)లో కేంద్రమంత్రి బండి సంజయ్ మంజూరు చేసిన బోరుబావికి బోరుమోటర్ బిగించి తాగునీటిని అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు వెల్దండి రాజేంద్రప్రసాద్, నాయకులు బొమ్మగాని సతీష్‌కుమార్, దొడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి భూభారతి రెవెన్యూ సదస్సులు

కుకునూరుపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి 17వ తేదీ వరకు మండలంలోని ఆయా గ్రామాలలో భూభారతి రెవెన్యూ సర్వీసులు నిర్వహిస్తామని కుకునూరుపల్లి ఎమ్మార్వో సుజాత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నేడు రాయవరం గ్రామంలో మొదటి రెవెన్యూ సదస్సును ప్రారంభించి 17వ తేదీన లకుడారంలో ముగుస్తాయని తెలిపారు. భూ సమస్యలు ఉన్నవారు, ప్రజలు అధిక సంఖ్యలో ఈ సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.



సిద్దిపేటలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



బెజ్జంకిలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



చిన్నకోడూరులో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# ఘనంగా రాష్ట్ర అవతరణ వేడుకలు



చేర్యాలలో జాతీయపతాకాన్ని ఎగురవేస్తున్న కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు దాసరిశ్రీకాంత్





సిద్దిపేట రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో జాతీయజెండాను ఎగురవేస్తున్న ఎంపీడీవో మురళీధర్ శర్మ

జిల్లాలో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు జాతీయ జెండాను ఎగురవేశారు .పార్టీ కార్యాలయాల్లో నాయకులు జెండా ఎగరవేసి అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కొన్ని చోట్ల తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. అమరవీరులకు నివాళులర్పించారు.

-న్యూస్‌నెట్‌వర్క్ జూన్ 2, (ఆంధ్రజ్యోతి):

### ఇందిరమ్మ మోడల్ నిర్మాణం పనులు వేగవంతం

సిద్దిపేట రూరల్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ మోడల్ ఇళ్ల నిర్మాణం పనుల్లో జాప్యం చేయవద్దని, పనులు వేగవంతం చేయాలని జిల్లా విద్యాధికారి, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం నారాయణరావుపేట మండలం కేంద్రంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ ఇళ్ల నిర్మాణం పనులను సందర్శించారు. డీఈవో మాట్లాడుతూ అర్హులైన వారికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ పథకంలో భాగంగా ఇళ్లను మంజూరు చేయడం జరుగుతుందని, లబ్ధిదారుల జాబితాలో పేర్లు ఉన్న వారు ఎవరికి డబ్బులు ఇవ్వవద్దని, అధికారులు మీ ఇంటి వద్దకు వచ్చే విచరణ చేపట్టి ఇళ్లు మంజూరు చేస్తారని వెల్లడించారు. ఇళ్లు మంజూరు చేయిస్తామని నమ్మబలికి డబ్బులు తీసుకునే ప్రయాత్నాలు జరుగుతున్నట్లు పెర్కొన్నారు.

## డిమాండ్ ఎక్కువ.. సరఫరా తక్కువ..

కుకునూరుపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు పచ్చిరొట్టె విత్తనాల డిమాండ్ ఎక్కువగా ఉన్నా అవి సరిగా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండల వ్యవసాయ అధికారుల లెక్కల ప్రకారం మండలంలో ఆరువేల ఎకరాల వరకు వరి పండిస్తారని అంచనా ఈ లెక్క ప్రకారం ఎంత లేదన్నజనుము, జీలుగా కలిపి 216 సంచులు వచ్చినట్టు సమాచారం. పచ్చిరొట్టె విత్తనాలు భూసారాన్ని పెంపొందిస్తాయని రైతులలో అవగాహన పెరగడంతో డిమాండ్ కూడా అధికమైంది. 50 శాతంతో ప్రభుత్వం సబ్సిడీ మీద రైతులకు సరఫరా చేస్తున్నది.

**ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం**

జీలుగా, జనము విత్తనాల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. త్వరలో మండలానికి వస్తాయి. వాటిని చల్లుకోవడానికి మరో 12 రోజుల సమయం ఉంది.

-మండల వ్యవసాయ అధికారి గోవిందరాజు

## కాంగ్రెస్ ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్..

- యువ వికాసం పేరుతో సీఎం రేవంత్ కొత్త డ్రామా
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

సిద్దిపేట , జూన్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చడంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అయ్యిందని బీఆర్ఎస్ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. సోమవారం సిద్దిపేటలోని పొన్నాల వద్ద తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి జాతీయ జెండాను ఎగరేసిన అనంతరం పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు దగ్గరవుదామని సీఎం రేవంత్‌రెడ్డి రాజీవ్ యువ వికాస్ అనే పథకం పేరుతో డ్రామా మొదలుపెట్టారని ఎద్దేవా చేశారు. చివరికి రాజీవ్ యువవికాసాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం వాయిదా వేయడం అంటే ప్రభుత్వం సరిగా పనిచేయడం లేదని అర్థమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని సీఎం నడుపుతున్నాడా లేక మంత్రులు నడుపుతున్నారా అర్థం కాని పరిస్థితి రాష్ట్రంలో నెలకొందని చెప్పారు. రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా రిజిస్ట్రేషన్ కోసం యువత రూ.వేలాదిగా ఖర్చు పెట్టుకుని నష్టపోయారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిలకడగా లేదని, పథకంపై క్యాబినెట్‌లో చర్చిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని వాఖ్యానించారు.

### గౌరవెల్లి ప్రాజెక్టు పనులపై నత్తనడక నడుస్తున్న మంత్రి పొన్నం

హుస్నాబాద్‌రూరల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): గౌరవెల్లి ప్రాజెక్టు పనులపై మంత్రి పొన్నం ప్రభాకర్ నత్తనడక నడుస్తున్నారని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ ఆరోపించారు. సోమవారం హుస్నాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మిగిలిన 42 ఎకరాల భూ నిర్వాసితులకు 19 లక్షల వరకు ప్యాకేజీ ఇవ్వడానికి కృషి చేశామన్నారు. ఎన్నికల సందర్భ ంగా గౌరవెల్లి ప్రాజెక్టు భూ నిర్వాసితులకు ఎకరానికి రూ. 30 లక్షల ప్యాకేజీ ఇస్తామని హామి ఇచ్చిన మంత్రి పొన్నం ఇప్పుడు రూ 17 లక్షలు మాత్రమే ఇస్తామని ఎందుకు మాట మార్చుతున్నారని ప్రశ్నించారు. సీఎం నియోజక వర్గం లగచర్లలో రైతులకు ఇచ్చిన ప్యాకేజీ ఇక్కడి రైతులకు వర్తింప చేయాలని సతీష్‌కుమార్ డిమాండ్ చేశారు. కాలువల నిర్మాణం కోసం రూ.437 కోట్లు మంజూరు తెచ్చామని ప్రకటించిన మంత్రి కాలువల కోసం ఎన్నిఎకరాలు భూ సేకరణ చేశారో చెప్పాలన్నారు. హుస్నాబాద్‌లో ఏర్పాటు చేస్తామన్నా మెడికల్ కాలేజీ, 150 పడకల ఆసుపత్రి ఏమైందని ప్రశ్నించారు. అప్పుడప్పుడు హుస్నాబాద్‌లో మాత్రమే వాకింగ్ చేస్తూ ప్రజలను కలిసినట్టు సోఫ్‌టాప్ చేయడమే తప్పా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు నియోజకవర్గ ప్రజలతో కనెక్టింగ్ తెగిపోయిందన్నారు.

### ఐక్యతతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం





ఆర్టీసీ డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎల్లయ్య

గజ్వేల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): ఐక్యతతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య అన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లు సోమవారం విధులు బహిష్కరించి, డిపో వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య అద్దె బస్సుల యజమానులతో చర్చించారు. ఈ సందర్భంగా రూ.15వేల వేతనం ఉండగా, రూ.18 వేలకు అంగీకారం కుదిరిందని తెలిపారు. ఫలితంగా రూ.3 వేల వేతనం పెరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ డిపో పరిధిలోని అద్దె బస్సు వేతనాలను పెంచుకోవడం జరిగిందని తెలిపారు. ఇతర సమస్యలపై డిపో మేనేజర్‌తో చర్చించినట్లు తెలిపారు. కార్మికులంతా ఐక్యతతో ఉంటే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు.

## ఇరువర్గాల మధ్య ఘర్షణ

- పలువురిపై కేసు నమోదు



ఆస్పత్రిలో రాజారామ్‌ను పరామర్శిస్తున్న ఎంపీ

సిద్దిపేట క్రైం జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటలో ఆదివారం అర్ధరాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురిపై కేసులు నమోదు అయ్యాయి. తమ ఇంటి బయట కట్టేసిన ఆవులను పరిశీలించి, తమపై రాళ్లు విసిరారని ఒక వర్గం వారు, తాము అటుగా వెళుతుంటే పాత కక్షల నేపథ్యంలో కులం పేరుతో దూషిస్తూ భౌతిక దాడులు చేశారని మరో వర్గం వారు ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకున్నారు. పట్టణంలో ఇంటి బయట కట్టేసిసే ఆవుల విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. విషయం తెలిసి సిద్దిపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి తన సిబ్బందితో అక్కడికి వెళ్లి పరిస్థితిని అదుపు చేశారు. ఈ ఘటనలో వీహెచ్‌పీ ఉమ్మడి మెదక్ జిల్లా కార్యదర్శి రాజారామ్‌కు గాయాలు కాగా, జిల్లా కేంద్ర ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లల సిద్దిపేట టూ టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు.

**దాడులు సరికాదు: ఎంపీ రఘునందన్‌రావు**

హిందూ సంఘాల నాయకుల మీద భౌతిక దాడులు మంచిది కాదని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజారామ్‌ను ఆయన పరామర్శించి మాట్లాడారు. పోలీసులు సరిగ్గా డ్యూటీ చేస్తే ఇలాంటి పరిస్థితులు ఏర్పడవన్నారు. దాడి చేసిన వారే కేసులు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. మతసామరస్యాన్ని పాటించడాన్ని మేము వ్యతిరేకించడం లేదని, కానీ ఉద్దేశపూర్వకంగా భౌతిక దాడులు చేసి హిందూ మతం గొంతు నొక్కితే శిక్ష తప్పదని హెచ్చరించారు. అనంతరం సిద్దిపేట పోలీస్ కమిషనర్‌ను పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కలిసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సిద్దిపేటలో గోరక్షకుడు రాజారాంపై జరిగింది ముమ్మాటికి హత్యాయత్నమేనని విశ్వహిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి రావునూతుల శశిధర్, ఆల్ ఇండియా మఠ మందిర్ అధ్యక్షులు రామరాజు అన్నారు. సోమవారం వారు సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజారామ్ ను పరామర్శించారు.

**సిద్దిపేట బంద్**

బజరంగ్ దళ్ నాయకుడు రాజారాంపై ఆదివారం రాత్రి ఓ వర్గానికి చెందిన వారు దాడి చేశారని ఆరోపిస్తూ హిందూ సంఘాలు సోమవారం సిద్దిపేట బంద్‌కు పిలుపునిచ్చాయి. దీంతో పట్టణంలోని వ్యాపారస్తులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. హిందూ సంఘాల నాయకులు పట్టణంలోని పలు వీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు.

## నాయకుడు ఎవరు?

(5వ పేజీ తరువాయి..)

ఆకుల విజయ, 2023లో స్థానికేతరుడైన ఈటెల రాజేందర్‌లకు టికెట్ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక్కడే ఓ నాయకుడికి ఇన్‌చార్జి పదవి ఇస్తే సదరు వ్యక్తి బలోపేతం అవడంతో పాటు పార్టీ కార్యక్రమాలు విస్తృతంగా జరగడం, పార్టీ కార్యకర్తల సదరు ఇన్‌చార్జి భరోసాగా నిలిస్తే పార్టీకి తిరుగు ఉండదు. గతంలో దుబ్బాక ఇన్‌చార్జిగా ఉన్న రఘునందన్‌రావు పలు పర్యాయాలు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చెందినప్పటికి ఎట్టకేలకు పార్టీ జెండాను ఆ గడ్డపై ఎగురవేశారు. అదే విధంగా గజ్వేల్ నియోజకవర్గంలో ఇన్‌చార్జిని నియమిస్తే ఇక్కడా పార్టీ బలోపేతం అవడం ఖాయమని పలువురు అభిప్రాయ పడుతున్నారు. కానీ ఈ దిశగా బీజేపీ అధిష్ఠానం ఎప్పుడూ దృష్టి సారించినట్లు కనబడలేదు.

**నిత్యం ప్రజల్లోనే కార్యకర్తలు, నాయకులు**

గజ్వేల్ నియోజకవర్గంలో ఆయా మండలాల కమిటీ అధ్యక్షులు ఆధ్వర్యంలో నిత్యం ప్రజల్లోనే నాయకులు, కార్యకర్తలు ఉంటున్నారు. కానీ వారిని సరైన మార్గంలో నడిపించే నాయకుడు లేకపోవడంతో ఎవరి దారి వారిదే అన్నట్లుగా పరిస్థితి ఉంది. గజ్వేల్‌లో త్వరలో మున్సిపల్ ఎన్నికలు రానున్న నేపథ్యంలో నాయకులు క్షేత్రస్థాయిలో అంతంతమాత్రంగానే పనిచేస్తున్నప్పటికీ, పార్టీ ఇచ్చే పిలుపును మాత్రం గౌరవిస్తూ పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. నియోజకవర్గంలో పార్టీని నడిపించే సరైన నాయకుడు ఉంటే మరింత బలోపేతం అయ్యే అవకాశం ఉందని, అధిష్ఠానం ఆ దిశగా ఆలోచన చేయాలని నియోజకవర్గానికి చెందిన ఓ సీనియర్ నేత అభిప్రాయపడ్డారు.

### ఐటీఐలో ప్రవేశాలకు ఆహ్వానం

కుకునూరుపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): కుకునూరుపల్లి ఐటీఐ కళాశాలలో వివిధ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటరమణ సోమవారం సూపర్ ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి చదివిన ప్రతి విద్యార్థి ఐటిఐలో చేరడానికి అర్హులని వయసు 14 సంవత్సరాలు ఉండాలని, రూ. 100 రూపాయలతో ఆన్లైన్‌లో అప్లై చేసుకుని ఐటిఐలో ప్రవేశం పొందవచ్చని తెలిపారు. కళాశాలలో ఐటిఐ విభాగంలో ఎలక్ట్రిషన్, ఫిట్టర్, వెల్డర్ మెకానిక్, డీజిల్ దీంతోపాటు ఏటీసీ విభాగంలో పలు కోర్సులలో ఖాళీలు ఉన్నాయని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అప్లికేషన్ దరఖాస్తుకు నేటి నుంచి ఈ నెల 21 తేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు.

### జిల్లా అభివృద్ధిలో అధికారులు భాగస్వాములు కావాలి

సిద్దిపేట కలెక్టరేట్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధిలో అధికారులు భాగస్వాములు కావాలని జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ పిలుపునిచ్చారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులద్దేశించి మాట్లాడుతూ.. దేశానికి ఆదర్శంగా నిలిచేలా సిద్దిపేట జిల్లాలో అభివృద్ధి జరుగుతుందన్నారు. అలాగే గ్రామీణ, పట్టణ అభివృద్ధి కార్యక్రమాలలో దేశ స్థాయిలో ఏ అవార్డు ప్రకటించిన సిద్దిపేట జిల్లా మొదటి స్థానంలో నిలుస్తుందని ముందు ముందు కూడా జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు గరిష్ట స్థాయిలో విజయవంతం అయ్యేలా అధికారులు అందరూ కృషి చేయాలని అన్నారు.

### పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

గజ్వేల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అనిత అబ్రహం అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల-ఎర్త్ బాక్స్ వెంచర్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య హరిత ఒప్పందం కుదిరిందని పేర్కొన్నారు. ఈ ఒప్పందం ప్రకారం కళాశాల నుంచి 610 కిలోల రీసైక్లబుల్ పేపర్ వేస్ట్‌ను ఎర్త్‌బాక్స్ సంస్థకు అప్పగించగా, ప్రతిగా ఎర్త్ బాక్స్ సంస్థ నుంచి పేపర్ బండిల్స్ కళాశాలకు అందించబడ్డాయని తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా కళాశాల పర్యావరణం పట్ల తమ బాధ్యతను చాటిందని, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. హరిత పద్ధతులను ప్రోత్సహించడంలో కళాశాల ఎల్లప్పుడు ముందు ఉంటుందని ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎంఎం లక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.


### కేంద్రమంత్రిని కలిసిన బీజేపీ నాయకులు

కొమురవెల్లి,జూన్02(ఆంధ్రజ్యోతి): మల్లన్న భక్తుల,పరిసర ప్రాంత ప్రజల సౌకర్యార్థం కొమురవెల్లిలో రైల్వే స్టేషన్ మంజూరు చేయించి అతి తొందరలోనే ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్న కేంద్రమంత్రి,తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డిని సోమవారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కొమురవెల్లి మండల పలువురు బీజేపీ నాయకులు కలిసి స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందించి ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే రైల్వేస్టేషన్ ప్రారంభ పనుల పరిశీలనతో పాటు మల్లికార్జున స్వామి దర్శనానికి రానున్నట్లు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపినట్లు బీజేపీ నాయకులు తెలిపారు.

### రేషన్‌కు మూడు సార్లు బయోమెట్రిక్

మద్దూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి) : మూడు నెలల రేషన్ పొందుటకు మూడు సార్లు బయోమెట్రిక్ ఇవ్వాల్సి ఉంటుందని తహసీల్దారు ఏజీ రహీం తెలిపారు. సోమవారం ఆయనిక్కడ విలేకర్లతో మాట్లాడారు. ఆహార భద్రత కార్డుదారులందరికి ప్రభుత్వం మూడు నెలల రేషన్ ఒకే సారి ఇస్తున్నందున కార్డు దారులు జూన్, జూలై. ఆగస్టు మాసాలకు సంబంధించి ఒకే సారి బయోమెట్రిక్ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని రేషన్‌కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### రవాణా శాఖ అధికారిగా లక్ష్మణ్



రవాణా శాఖ అధికారి లక్ష్మణ్

సిద్దిపేట క్రైం, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా రవాణా శాఖ ఇనచార్జి అధికారిగా లక్ష్మణ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. సిరిసిల్ల జిల్లా రవాణా శాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మణ్ ను ఇన్‌చార్జిగా నియమిస్తూ రవాణా శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

## ప్రజాపాలనే పరమావధిగా..

(5వ పేజీ తరువాయి..)

అనంతరం విత్తనోత్పత్తిని ప్రోత్సహించే క్వాలిటీ సీడ్ ఎట్ ఎవ్రీ విలేజ్ కార్యక్రమాన్ని ప్రారంభించి వివిధ మండలాల రైతులకు విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్డీవోలు, జిల్లా అధికారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే సిద్దిపేటలో నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని, కష్టపడ్డ ప్రతి నాయకుడు, కార్యకర్తను అధిష్టానం గుర్తిస్తుందని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సోమవారం సిద్దిపేట పట్టణంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా స్టేడియంలో జరిగిన కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, కాసేపు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్‌లతో కలిసి నాయకులు, కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించారు ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరు కూడా అధైర్యపడవద్దని మీకు అండగా ఎప్పటికీ అందుబాటులో ఉంటానన్నారు.

### రూ.1,00,116 విరాళం..

చేర్యాల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద వితరణ పథకానికి జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం తమ్మడపల్లి గ్రామానికి చెందిన అమురరాజయ్య రూ.1,00,116 విరాళంగా అందించాడు.

### రైతులను ఆర్థికంగా దెబ్బతీయొద్దు

కుకునూరుపల్లి, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలను రైతులకు విక్రయించి వారిని ఆర్థికంగా దెబ్బతీయొద్దని గజ్వేల్ ఏసీపీ నర్సింహులు విత్తన దుకాణదారులను కోరారు. సోమవారం కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని విత్తనాల దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ఆయన వారికి పలు సూచనలు చేశారు. గడువు తీరిన విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లో రైతులకు అమ్మవద్దని, నాణ్యమైన కంపెనీ విత్తనాలనే అమ్మాలని, ప్రతి ఒక్క దుకాణదారుడు లైసెన్స్ కలిగి ఉండాలని లేని యెడల వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### గీతా కార్మికుడికి గాయాలు

చిన్నకోడూరు, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తాటి చెట్టు దిగుతుండగా ప్రమాదవశాత్తు జారి పడిన గీతా కార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని మాచాపూర్ గ్రామంలో సోమవారం చోటు చేసుకున్నది. మాచాపూర్‌కు చెందిన గీతా కార్మికుడు గొల్లపల్లి చంద్రశేఖర్‌గౌడ్ సోమవారం కల్లు గీస్తుండగా చెట్టుపై నుంచి కిందికి దిగుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడి కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలై ఎడమ కాలు విరిగింది.

### మల్లన్నసాగర్‌ను సందర్శించిన గజ్వేల్ ఏసీపీ



మల్లన్నసాగర్ పంపుహౌస్‌ను సందర్శించి వివరాలు తెలుసుకుంటున్న గజ్వేల్ ఏసీపీ నర్సింహులు

తొగుట, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): తొగుట మండలం తుక్కాపూర్ గ్రామ శివారులో 50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన మల్లన్నసాగర్ రిజర్వాయర్‌ను సోమవారం గజ్వేల్ ఏసీపీ నర్సింహులు సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ నిర్మాణ తీరుతెన్నులను మల్లన్నసాగర్ డీఈఈ చెన్ను శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్ట్ వద్ద బందోబస్తు తీరుతెన్నుల విషయమై అధికారులతో మాట్లాడారు. అంతముందు లింగాపూర్ గ్రామ శివారులో ఉన్న వైష్ణవి కన్‌స్ట్రక్షన్ వారి ఎక్స్‌ప్లోజివ్ గోదాంను తనిఖీ చేశారు. గోదాంకు సంబంధించి అనుమతి పత్రాలు సరిగా ఉన్నాయా లేదా అని చెక్ చేసి స్టాక్ వివరాలను పరిశీలించారు. ఎక్స్‌ప్లోజివ్ భద్రపరిచినపుడు సెక్యూరిటీ పెట్టాలని, అదే విధంగా ప్రమాదాలు జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట తొగుట ఎస్సై రవికాంత్‌రావు ఉన్నారు.

### రైతులకు మూల విత్తనం కిట్ల పంపిణీ

జగదేవ్‌పూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎంపిక చేసిన అభ్యుదయ రైతులకు ఆచార్య జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం రూపొందించిన నాణ్యమైన మూల విత్తనాల కిట్లను మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి వసంతరావు అన్నారు. సోమవారం జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక ఏర్పాటు చేసిన సమావేశంలో ఏవో వసంతరావు మాట్లాడుతూ మండలంలో 18 రెవెన్యూ గ్రామాలకు 36 మంది రైతులకు వరి డబ్ల్యూజీఎల్ రకం 10 కేజీల కిట్లు 18 మంది రైతులకు, పెసర యంజీజీ 385 రకము మూడు కేజీల కిట్లను ప్రజా ప్రతినిధుల, వ్యవసాయ అధికారుల చేతులమీద పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

### భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు



జగదేవ్‌పూర్ తహసీల్దార్ నిర్మల

జగదేవ్‌పూర్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించడానికి గ్రామాలలో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు జగదేవ్‌పూర్ తహసీల్దార్ నిర్మల అన్నారు. సోమవారం జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతిలో భూ సమస్యల పరిష్కారం గ్రామంలో గ్రామ సభను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భూభారతి 2025 చట్టంలో భాగంగా భూ సమస్యల పరిష్కారం కొరకు గ్రామాలలో గ్రామసభలు నిర్వహిస్తున్నందున రైతులు ఇట్టి సభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### హరీశ్‌రావు చర్చకు సిద్ధమా...?

గజ్వేల్, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు, వ్యవసాయ సంక్షేమంపై మాజీ మంత్రి హరీశ్‌రావు చర్చకు సిద్ధమా అని టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు సవాల్ విసిరారు. గజ్వేల్ పట్టణంలోని ఆయన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ, దేశ చరిత్రలో ఎన్నడూ లేనంతగా రూ.21వేల కోట్ల రూపాయల రైతు రుణమాఫీ చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీ, రేవంత్‌రెడ్డి ప్రభుత్వానిదన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి ఇవ్వని విధంగా రైతాంగానికి సన్న ధాన్యానికి క్వింటాలు రూ.500 బోనస్ ఇస్తున్నారని, దేశంలోనే అత్యధిక ధాన్యాన్ని పండించిన చరిత్ర రైతాంగానిది అయితే, కొనుగోళ్లు జరిపిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వర్గల్ మండలం వేలూరులో రైతు తన భూమిని కేసీఆర్ గుంజుకుంటున్నాడని ఆవేదనతో సెల్ఫీ వీడియో తీస్కొని ఆత్మహత్య చేసుకున్నారని, మల్లన్నసాగర్ రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్న విషయాన్ని గుర్తు చేశారు. ఎర్రవల్లి, ఏటిగడ్డ కిష్టాపూర్‌లో రైతులపై లాఠీఛార్జీ చేసి కేసులు పెట్టి హింసించిన విషయాన్ని ప్రజలు మరచిపోలేదన్నారు.

### చేతికి అందేలా విద్యుత్‌వైర్లు

దౌల్తాబాద్, జూన్ 2(ఆంధ్రజ్యోతి): ఓ కూలీ ఆయిల్‌పామ్ తోటలో పని చేస్తూ వేలాడుతున్న వైర్ల కారణంగా విద్యుదాఘాతానికి గురై తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకుని ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నాడు. దౌల్తాబాద్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సయ్యద్ రహీమోద్దీన్ ఆయిల్ పామ్ తోటలో విద్యుత్ వైర్లు చేతికందేలా ఉన్నాయి. విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతున్నాయాని సరి చేయాలని ఎన్ని సార్లు,ఏఈకి డీఈకి,ఫిర్యాదు చేసిన, ఫోన్లు చేసిన అధికారులు పట్టించుకోకపోవడంతో తోటలో పని చేసే కూలీలకు ప్రమాదం జరిగిందని ఆయిల్‌పామ్ యాజమాని రహీమోద్దీన్ ఆగ్రహం వ్యక్తం చేశాడు.

